క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

లక్కిరెడ్డిపల్లి : మండల సర్వసభ్య సమావేశం నేడు శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాయచోటి శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్ రెడ్డి హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరుకావాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

28, 29న గడప గడపకు మన ప్రభుత్వం

గాలివీడు : సోమ, మంగళవారాల్లో మండలంలోని పూలుకుంట, బోరెడ్డిగారిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొంటున్నట్లు ఎంపీడీఓ శేఖర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ విద్యార్థులచే స్వచ్ఛ పక్వాడ నిర్వహించినట్లు ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ తెలిపారు. 30 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రాజకుమార్ ఆదేశాల మేరకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఎన్‌సీసీ సామాజిక కార్యక్రమాలలో భాగంగా హవాల్దార్‌లు సమయ్ సింగ్, ప్రకాష్ ప్రమోద్‌లతో కలిసి పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించినట్లు రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ల తనిఖీ



ట్రాన్స్‌ఫారాలను పరిశీలిస్తున్న ఎస్‌ఈ, డీఈఏలు

రైల్వేకోడూరు అర్బన్ : విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ సరఫరాలలో అంతరాయాలు లేకుండా చూడాలని శుక్రవారం ఎస్‌ఈ రమణ, డీఈ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. పట్టణంలోని పలు ట్రాన్స్‌ఫారాలను, సబ్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. ప్రజలకు, రైతులకు సరఫరా చేసే విద్యుత్‌లో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. అలాగే బకాయిలు వసూలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : నవోదయ పాఠశాలలో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 – 2025 సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో చేరేందుకు జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్షల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. దరఖాస్తుల సమర్పణ గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను నవోదయ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న చొప్పాఎల్లారెడ్డి, పాల్గొన్న విద్యార్థులు

రాజంపేట రూరల్ : ఒకరు చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానం చేస్తుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి తెలియజేశారు. మండల పరిధిలోని కె.బోయినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వీ ఆర్ విత్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత రక్తదాన శిబిరంను ఏర్పాటు చే శారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శిబిరంలో సేకరించిన 100 యూనిట్ల రక్తాన్ని కడపకు చెందిన భోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంక్ సభ్యులు వాహిద్, మణిలకు అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భోగా రాజా, బొడిచెర్ల శివయ్య, మాజీ సర్పంచ్ శివయ్య, ఏఐటీఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- గడప గడపకు మన ప్రభుత్వంతో చంద్రబాబు గుండెల్లో గుబులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల



సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల



రైల్వేకోడూరు: ఎంపీ మిథున్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న మంగంపేట నిర్వాసితులు

పుల్లంపేట : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలో నుంచి పుట్టిన గడప గడపకు మన ప్రభుత్వానికి వస్తున్న ప్రజాస్పందన చూసిన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు గుండెల్లో గుబులు పుట్టిస్తోందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి, ఎగువరెడ్డిపల్లి, ఎస్టీకాలని, అనంతరంపల్లె గ్రామాలలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుగా సాగుతున్నారన్నారు. భారత దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 95 శాతం పూర్తిచేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 650 హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా కాలయాపన చేశారన్నారు. ప్రస్తుతం దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌తో కలిసి సంక్షేమాన్ని అడ్డుకుంటున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ప్రజాదరణను చూసి ఓర్వలేక లోకేష్ తనకు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా మీ అందరికి తోడు నీడగా నిలుస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 2024 ఎన్నికల్లో మీరంతా మళ్లీ ఒకసారి ఆశీర్వదించాలని గడప గడపలో ప్రజలను కోరారు. గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం లబ్ధి పొందాలంటే మొట్టమొదటిగా జన్మభూమి కమిటీలకు ముడుపులు ముట్టచెబితే గాని లబ్ధి చేకూరేది కాదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు కులమతాలు, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. అలాగే రెడ్డిపల్లె గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులను పరిశీలించారు. సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు భూ పంపిణీలో భాగంగా అర్హులకు ప్రభుత్వ భూ పంపిణీ కార్యక్రమం నిర్వహించామన్నారు. పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. పుల్లంపేట మండలానికి బీటీరోడ్లు, సీసీరోడ్లు వేస్తూ మండలం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జెట్పీటీసీ గీతాదేవి, మండల కన్వీనర్ ముస్తాక్, కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రమణారెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తహసీల్దారు నరసింహకుమార్, హరినాథరెడ్డి, ఎంపీడీఓ రఘురామ్, ఎస్ఐ రఘురామ్, నలినీకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

మండలంలోని అనంతంపల్లె పంచాయతీ చాపల హరిజనవాడకు చెందిన హరి (25) గురువారం రాత్రి ట్రాక్టర్ ఢీ కొని మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి, ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డిలు పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని వారు తెలియజేశారు.

ఎంపీని కలిసిన మంగంపేట నిర్వాసితులు

రైల్వేకోడూరు : మంగంపేట సమస్యలను పరిష్కరించాలని మంగంపేట ఆర్‌ఆర్–4 నిర్వాసితులు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులును కోరారు. శుక్రవారం కోడూరుకు విచ్చేసిన వారిని కలిసిన పలు సమస్యల పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పనిసరిగా సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తగిన విధంగా అందరికీ న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో పలు విషయాలపై వారు చర్చించారు.

అంగన్‌వాడీలకు ఏకరూప దుస్తుల పంపిణీ

సిద్దవటం : మండలంలోని మాధవరం1 గ్రామ పంచాయతీ పరిధిలోని బంగారుపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లకు ఏకరూప దుస్తుల(యూనిఫాం)ను పంపిణీ చేశామని అసిస్టెంటు సీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజర్ శ్రీవిద్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది ఏకరూప దుస్తులు ధరించాలన్న ఉద్దేశంతో అధికారుల ఆదేశాల మేరకు మండలం లోని భాకరాపేట సెక్టార్, ఒంటిమిట్ట మండల పరిధిలోని నడింపల్లి సెక్టార్‌ల అంగన్‌వాడీలకు యూనిఫాం దుస్తులను అందజేశామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఓబులవారిపల్లె : మండలంలోని ముక్కవారిపల్లె పంచాయతీ తురకపల్లె గ్రామంలో సిమెంటు రోడ్డు పనులను సర్పంచ్ అరవ శ్రీధర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీధర్ మాట్లాడుతూ ఇటీవల గ్రామాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్ రెడ్డి సందర్శించారన్నారు. గ్రామస్తులు పక్కా రోడ్డు వేయించాలని కోరగా ఇందుకు ముక్కా రూపానందరెడ్డి తమ సొంత నిధులతో ఇచ్చిన మాట ప్రకారం 350 మీటర్లు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. సమస్య పరిష్కడంతో రూపానందరెడ్డికి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రవిశంకర్ రెడ్డి, శంకర్ రెడ్డి, ముక్కా రామసుబ్బారెడ్డి, మహబూబ్ బాషా, నౌషాద్ బాషా, మహ్మద్ అలీ, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అన్ని సదుపాయాలతో పేదలకు సేవలు

సిద్దవటంలో రాత్రి సమయంలోనూ పేదలకు వైద్య సేవలు



ఆటోమేటెడ్ అనలైజర్ పరికరాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి డాక్టర్ మధుశేఖర్

సిద్దవటం : మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో 64 రకాల రక్త పరీక్షలకు సంబంధించి ఆటోమేటెడ్ అన్వైజర్ మిషనరీని ఏర్పాటు చేశామని వైద్యాధికారి డాక్టర్ మధుశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ వైద్యశాలలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, పీడీయాట్రీషన్, గైనకాలజిస్టు, జనరల్ దంత సమస్యలకు వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. 30 పడకల అధునాతన భవనంలో అన్నీ పరికరాల అందుబాటులో ఉన్నాయన్నారు. ల్యాబ్‌లో కావలసిన అన్నీ పరీక్షలు చేయడానికి ఫుల్లీ ఆటోమేటెడ్ అనలైజర్ పరికరంతోపాటు సెంటిఫ్యూస్ మిషన్, ఆర్‌ఓ ప్లాంట్, ఈఎస్ఆర్ మిషన్ అందుబాటులో ఉన్నాయన్నారు. రాత్రి సమయంలోనూ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని ఆయన తెలియజేశారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ దుర్గమ్మ కాలనీవాసులు తమకు తాగునీటి సౌకర్యం కల్పించాలని శుక్రవారం ఖాళీ బిందెలతో కాలనీలోనే నిరసన తెలిపారు. తాము ఎస్టీ వర్గానికి చెందిన వారము, మా కాలనీకి గత కొన్ని నెలలుగా తాగునీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటి కోసం పంట పొలాల్లోకి వెళుతున్నామన్నారు. ఎవరికైనా చెబితే వారు హడావిడిగా వచ్చి చూసి పోతున్నారే తప్ప సమస్య తీరలేదని ఆ ప్రాంతం మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.

ఏపీ గిరిజన సమాఖ్యకు జిల్లా నూతన కమిటీ

రాయచోటి అర్బన్ : ఏపీ గిరిజన సమాఖ్యకు జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ నాయక్ అధ్యక్షతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ నూతన జిల్లా అధ్యక్షుడిగా రెడ్డిశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా గుండా శివలక్ష్మి, ఉపాధ్యక్షులుగా రవినాయక్, రాజారాం నాయక్, పోలూరు రమేష్, రెడ్డెయ్య, పోలా వెంకటయ్య, శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా మల్లికార్జున నాయక్, బోకే క్రిష్ణవేణి, పూజారి రామచంద్రయ్య, దేవరాణి, వెంకటసుబ్బయ్యలు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

కరువు సహాయక చర్యలను చేపట్టాలి

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం కరువు సహాయక చర్యలను చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ మాజీ సభ్యుడు వై.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల్లో ఎండుతున్న మామిడి తోటలతోపాటు పంటలకు సైతం నీటి తడులను అందించి కాపాడాలంటూ కోరారు. వర్షాభావం కారణంగా బోరుబావుల్లో నీరు అడుగంటిపోవడంతో రైతులను కలవరపెడుతోందన్నారు. మరి కొద్ది రోజులు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ప్రజలు తాగునీటికి సైతం ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి పొంచి ఉందన్నారు. ప్రభుత్వం సకాలంలో స్పందించి కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులు, ప్రజలను ఆదుకోవాలన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. మానస



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డా.ఎస్. మానస

సిద్దవటం : వాటర్ షెడ్ రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇచ్చినట్టు కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. మానస తెలిపారు. శుక్రవారం మండలంలోని జ్యోతి గ్రామంలో ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం వారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి, పసుపు, డ్రాగన్ ఫ్రూట్ పంటల్లో సమగ్ర పంటల యాజమాన్యం, నూతన వంగడాలు, చీడాపీడలు, తెగుళ్ల యాజమాన్యాలపై రైతులకు వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త టి. స్వామి చైతన్య మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం, ఊటుకూరు, కడప కేంద్రం నుంచి ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో జిల్లా రైతాంగానికి రాబోవు 5 రోజులకు వాతావరణ సమాచారం, వాతావరణ ఆధారిత సూచనలు అందించడం జరుగుతుందని, ఈ సూచనలను అనుసరించి రైతులు తమ పంటల్లో తగు జాగ్రతలను తీసుకోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ టి. మహేష్‌బాబు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం అందించే విస్తరణ సేవలు, సమీకృత వ్యవసాయ పద్ధతుల ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో బద్వేల్ వాటర్ షెడ్ ప్రాజెక్టు అధికారి బి. వేణుగోపాల్‌రెడ్డి, వాటర్ షెడ్ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : బీడీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తపల్లెలోని జెండామాను వీధి, రమీజాబాను వీధిలలో ఆయన బీడీ కార్మికులకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు వెయ్యి బీడీలు చుడితే రూ. 200 నుంచి 260లు కూలీగా చెల్లిస్తున్నారన్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న ధరలతో కార్మికుల కుటుంబాలు నడవడం ఇబ్బందిగా మారిందన్నారు. రాష్ట్రంలోని బీడీ కార్మికులకు ఇతర రాష్ట్రాల్లో లాగా వెయ్యిబీడీలకు రూ.500 చొప్పున కూలీని చెల్లించాలన్నారు. బీడీ కార్మికుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్యశాలల్లో వైద్యుల కొరత ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు స్పందించి బీడీకార్మికుల సౌకర్యార్థం ఆధునిక వైద్యవసతులతో కూడిన వైద్యశాలను ఏర్పాటు చేయాలంటూ కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, కార్మికులు కదిరున్నీసా, ముబీనా, నసీమా, షఫీ, ముంతాజ్, ఫమీదా, రఫీవున్నీసా, రేష్మా, పర్వీన్, షబానాతోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీసీసీ బ్యాంకు అధికారులు

సిద్దవటం : డీసీసీ బ్యాంకు సేవాలను తెలియజేసేలా వారానికి ఒక గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని ఏజీఎం నారాయణ రాజు, మేనేజర్ కవిత, నోడల్ అధికారిణి సుచిత్రలు తెలిపారు. మండలంలోని వెలుగుపల్లె గ్రామాన్ని శుక్రవారం బ్రాంచ్ సిబ్బంది, ప్రధాన కార్యాలయ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని రైతులు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లు, రైతు మిత్ర గ్రూప్‌ల సభ్యుల ఇంటికి వెళ్లి వారి లోన్ సమాచారం తెలుసుకొని డీసీసీ బ్యాంకు ప్రత్యేకతలను, ముఖ్యంగా రైతు భాగస్వామ్యం గురించి వివరించారు. అలాగే ఇతర బ్యాంకుల వడ్డీ రేట్లు, ఫీజు వసూళ్ల గురించి తెలిపినట్టు చెప్పారు. డీసీసీ బ్యాంకు జిల్లా అభివృద్ధి కోసం పాటు పడుతుందన్నారు. అంతేగాకుండా లోన్ తీసుకున్న ప్రతి ఒక్కరూ సక్రమంగా రుణాలు చెల్లిస్తే వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు తీసుకొనవచ్చునని వివరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బీసీలంటే సీఎం జగన్‌కు అభిమానం



ఈశ్వరయ్య నల్లబోతుల

రాజంపేట : వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బీసీ నేత నల్లబోతుల ఈశ్వరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను జిల్లా రెవెన్యూ అధికారి పదవి నుంచి పదవీ విరమణ పొందిన తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరి, పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి బీసీల అంటే ఎనలేని అభిమానం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావడం తథ్యమన్నారు. తనకు పదవి ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలను తెలుపుకుంటున్నానని అన్నారు. తనను జిల్లా ఉపాధ్యక్ష పదవి రావడానికి కృషి చేసిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, పోలాలకు కృతజ్ఞతలను తెలియజేశారు.

జిల్లా కమిటీలో పలువురు రాజంపేట నేతలు

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులుగా గాలివీటి వీరరంగారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, సభ్యులుగా వర్ధిబోయిన సుధాకర్‌బాబు, సోమలరాజు బాలరాజు, సోమిశెట్టి ప్రభాకర్, హెచ్.ఉమామహేశ్వరరెడ్డి, ఆర్.కమలాకర్ రావులకు చోటు దక్కింది.

సచివాలయాలతో ప్రజలకు పాలన చేరువ

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల కేంద్రంలో నూతనంగా నిర్మితమైన గ్రామ సచివాలయాన్ని మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ రెడ్డి, రాజంపేట వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి విజయసాగర్ రెడ్డి (మదన్‌రెడ్డి)లు ప్రారంభించారు. శుక్రవారం ఈ నూతన భవనాన్ని ప్రారంభించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు చేరువుగా పాలన సాగాలని, ప్రజల ఇంటి వద్దకే సేవలు అందించాలనే ఆకాంక్షతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి, పెదవీడు సర్పంచ్ నాగిరెడ్డి, జిల్లా బీసీ సంఘం నాయకులు మోడం నాగభూషణం, యర్రగడ్డల సుబ్బరామ, స్థానిక నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

శ్రావణ మాసం ఎంతో విశిష్టమైంది. పూజలు, వేడుకలతో ఈ మాసం ఆధ్యాత్మికతను పెంపొందించేలా చేస్తుంది. అందులోనూ శ్రావణ శుక్రవారం ఎంతో విశేషం కలిగింది. అష్ట ఐశ్వర్యాలను, సర్వ భాగ్యాలను సిద్ధించే మహాలక్ష్మీ దేవికి శ్రావణ మాస రెండో శుక్రవారం నాడు వ్రతం ఆచరిస్తే సిరి సంపదలు, భోగభాగ్యాలు, సంతానం పొందుతారని పురాణాలు తెలియజేస్తున్నాయి. దీంతో ఈ పర్వదినాన వ్రతం ఆచరించడం ఆనవాయితీ. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజక వర్గాల పరిధిల్లోని పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా జరిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిని విశేషంగా అలంకరించి, పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయచోటి పట్టణంలో భద్రకాళి అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం



సంబేపల్లె: వరలక్ష్మీ వ్రతానికి హాజరైన భక్తులు



రైల్వేకోడూరు అర్బన్: 108 చీరలతో విశేష అలంకారంలో అమ్మవారు



చిన్నమండెం మండలం మల్లూరమ్మ ఆలయంలో..



రాయచోటి: వరలక్ష్మీ వ్రత పూజలో పాల్గొన్న మహిళలు



పెనగలూరు: వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



సిద్దవటం: పూజలందుకున్న శీతల గంగమ్మ



గాలివీడు: వరలక్ష్మీ వ్రతం ఆచరించిన భక్తులు



లక్కిరెడ్డిపల్లె మండలంలో...



రాజంపేట టౌన్: వరలక్ష్మీదేవి ప్రతిమ